ప్రజాశక్తి

శనివారం 2 సెప్టెంబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సొంతిల్లు కలేనా?

- రాజధాని ఆర్-5జోన్‌లో ఇళ్ల నిర్మాణంపై పీటముడి
- గుంటూరు, ఎన్‌టిఆర్‌జిల్లాల వాసుల్లో తీవ్ర నిరాశ
- హైకోర్టు ఉత్తర్వులపై స్టేకు సుప్రీం నిరాకరణ



జులై 24న రాజధాని ప్రాంతమైన మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని అమరావతిలోని ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాన్ని నిలిపివేస్తూ రాష్ట్ర హైకోర్టు గత నెల 3వ తేదీన ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం మరింత అయోమయంలో చిక్కుకుంది. హైకోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వడానికి నిరాకరించిన సుప్రీంకోర్టు తదుపరి విచారణకు నవంబరుకు వాయిదా వేసింది. ఈ నిర్ణయంతో ఇళ్ల నిర్మాణం ఇప్పట్లో జరిగే అవకాశం కన్పించడం లేదు. ఒక వైపు సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో జనవరి తరువాత అనుమతి వచ్చినా ఎన్నికల కోడ్ వచ్చి ఇళ్ల నిర్మాణం పూర్తిగా ఆగిపోయే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆర్-5 జోన్‌లో ఇళ్లు నిర్మించి లబ్ధిదారుల కుటుంబాలను మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలో ఓటర్లుగా చేర్పించి తద్వారా ఈ రెండు నియోజకవర్గాలను గెలవాలన్న వైసిపి ఎత్తుగడ ఫలించే అవకాశం లేదు. దీంతో ఒక వైపు వైసిపి నేతలు డీలాపడ్డారు. తమకు రాజధానిలో ఇల్లు వస్తుందనుకున్న నమ్మకం పోయిందనిలబ్ధిదారులు వాపోతున్నారు.

రాజధాని అమరావతి పరిధిలో గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన 50,793 మంది పేదలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి జులై 24న సిఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టులో గత కొంతకాలంగా విచారణ జరుగుతున్నా ప్రభుత్వం హడావుడిగా గత నెల 24న శంకుస్థాపనకు చేసింది. సిఎం శంకుస్థాపన చేసిన 10 రోజుల్లోనే హైకోర్టు నుంచి నిర్మాణాలను నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు జారీ అయ్యాయి.

▶ 2లో



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఎన్ఇపితో పేదలకు విద్య దూరం

ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

నూతన జాతీయ విద్యావిధానం వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతారని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గుంటూరు జిల్లా ప్లీనరీ సమావేశం శుక్రవారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్పులు చేస్తూ, పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నాయని అన్నారు. కేంద్రం ప్రభుత్వం పాఠ్యపుస్తకాలలో మొగలుల చరిత్ర, డార్విన్ సిద్ధాంతం, మానవ హక్కులు వంటి అంశాలను తొలగించటం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను షరతుల్లేకుండా అందరికీ అందించాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు పునరుద్ధరించాలని, విద్యా, వసతి దీవెన పూర్తి స్థాయిలో అందించాలని, జిఒ 77 రద్దు చేసి, పీజీ చదివే విద్యార్థులకు విద్యా, వసతి దీవెన ఇవ్వాలని తదితర సమస్యలపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎన్.భావన్నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం

▶ 2లో

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి 8లో



మంగళగిరి మండలం ఆత్మకూరు సచివాలయం వద్ద ధర్నాలో పాశం రామారావు, ప్రజలు

సచివాలయాల వద్ద సిపిఎం ధర్నా

- ప్రజా సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కొనసాగిన ప్రచారభేరి

4,5లో



సత్తెనపల్లిలో నిర్వహించిన ప్రచార భేరీలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు విడుదల

జిల్లా నుండి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు గుంటూరు జిల్లా నుండి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. గుంటూరు నగరానికి చెందిన శారదా నికేతన్ ఓరియంటల్ హైస్కూల్ హెచ్ఎం ఎన్.ఉషాకుమారి అవార్డుకు ఎంపికయ్యారు. వట్టిచెరుకూరు మండలం, గారపాడు బికెఆర్ జెడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలు కె.సునీత, గుంటూరు నగరంలోని కొరిటపాడు ఆర్‌సిఎం యుపి స్కూల్లో ఎస్‌జిటిగా పనిచేస్తున్న ఇ.అనిల్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 5న రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవాల్లో వీరు అవార్డులు అందుకోనున్నారు.



ఉషాకుమారి, సునీత, అనిల్‌కుమార్

సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుంటే జగన్ ఇంటికే

మంత్రి అంబటి రాంబాబు వద్దకు భవన నిర్మాణ కార్మికుల సామూహిక రాయభారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రెండు నెలల్లో పునరుద్ధరించాలని, నాలుగున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న క్లైమూల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకుంటే వచ్చే ఎన్నికలలో భవన నిర్మాణ కార్మికులు జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపిస్తారని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మంత్రి అంబటి రాంబాబు వద్దకు శుక్రవారం సామూహిక రాయబారం నిర్వహించగా తొలుత భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి షేక్

▶ 2లో



మంత్రి రాంబాబు కార్యాలయం వద్దకు ప్రదర్శనగా వెళ్తున్న భవన నిర్మాణ కార్మికులు, నాయకులు



గుండెపోటుతో యువ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలోని నంబూరు పంచాయతీలో స్వీపర్‌గా పని చేస్తున్న మానికల బాల పుష్పరాజు (18) గుండెపోటుతో గురువారం మరణించారు. నంబూరు అలీరఫత్ నగర్‌లోని బాలపుష్పరాజు భౌతికకాయాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, నాయకులు కె.సత్యనారాయణ, కె.సుబ్బారావు, సాంబయ్య, నరసింహారావు శుక్రవారం సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పుష్పరాజుకు తల్లిదండ్రులు, చెల్లి, తమ్ముడు ఉన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువు

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని కొప్పుకొండ రెవెన్యూ నడిగడ్డ గ్రామంలో 79.60 సెంట్లలో అనుమతుల్లేకుండా చేపలు పెంచుతున్నట్లు అధికారుల విచారణలో తేలింది. చెరువు వద్దకు తహసీల్దార్, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్, విఆర్ఒ, గ్రామ ఫిషరిష్ అసిస్టెంట్స్, శుక్రవారం వెళ్లి పరిశీలించారు. రాజ్యలక్ష్మి ఆక్వా లిమిటెడ్, జెవిఎస్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్, యన్.స్వర్ణా దేవి అనుమతులు లేకుండా చేపలు పెంచుతున్నట్లు నిర్ధారించారు. వారిపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం-2020 ప్రకారం కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ కేథార్‌నాథ్

భూ రీసర్వే పై అవగాహన

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

భూ రీసర్వేపై మండలంలోని ఉప్పరపాలెంలో పంచాయతి కార్యాలయం వద్ద తహశీల్దార్ శ్రీకాంత్ కేథార్నాథ్ ఆధ్వర్యంలో రైతులతో శుక్రవారం అవగాహన కల్పించారు. సర్వే చేసేటప్పుడు ప్రతి ఒక్క రైతు డాక్యుమెంట్స్‌ను అందించాలన్నారు.

వచ్చే నెలలో ఆడుదాం ఆంధ్ర పోటీలు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వచ్చేనెల రెండో తేదీనుండి నిర్వహిస్తామని ఎంపిడిఒ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పోటీలు గ్రామ మండల నియోజకవర్గం జిల్లా రాష్ట్రస్థాయిలో జరుగుతాయని, క్రికెట్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు గ్రామ సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుంటే జగన్ ఇంటికే

(మొదటి పేజీ తరువాయి)

సిలార్ మసూద్ అధ్యక్షతన స్థానిక గార్లపాడు సెంటర్‌లో జరిగిన భవన నిర్మాణ కార్మికుల బహిరంగ సభలో నరసింహారావు మాట్లాడారు. కార్మికులు అనేక సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని సాధించుకున్నారని అన్నారు. ఈ చట్టంలోని సంక్షేమ బోర్డు నిధులు గత ప్రభుత్వం ఇతర శాఖలకు మళ్లించితే భవననిర్మాణ కార్మికులు చేసిన ఆందోళనలో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారని చెప్పారు. తాను అధికారంలోకి వస్తే ఇతర రాష్ట్రాల కంటే కూడా మెరుగైన విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తానన్నారని గుర్తు చేశారు. నిర్మాణదారులు నుండి వస్తువులు చేసిన 1 శాతం డబ్బులు కార్మికుల సంక్షేమ పథకాలకు ఖర్చు చేయవచ్చునని, రాష్ట్ర బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించిన అవసరం లేదని అన్నారు. కరోనా లాక్ డౌన్ కాలంలో రెండేళ్లపాటు కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతుంటే వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సిమెంటు, స్టీలు ఇతర మెటీరియల్ ధరలన్నీ విపరీతంగా పెరగడతో కార్మికులకు పనులు తగ్గి తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. జిల్లాలో అనేక మంది కార్మికులు ఆకలి మరణాలు సంభవించాయని అన్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం 2381 గాను రూ.5 కోట్ల 99 లక్షల 21 వేలను సంక్షేమ బోర్డులో భవన నిర్మాణ కార్మికులకు బకాయి ఉందని, ఈ క్లైముల పరిష్కారానికి అడ్డంకిగా ఉన్న 1214 మెమోను వెంటనే రద్దుచేసి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గరీబి కళ్యాణ యోజన పథకం అమలు చేయడం కోసం కార్మికుల దగ్గర నుండి ఆధార్ బ్యాంక్ ఎకౌంటు కార్మికులకు గుర్తింపు కార్డులు జిరాక్స్ కాపీలు సేకరించినా ఏ ఒక్క కార్మికునికి కూడా ఒక రూపాయి కూడా ఎకౌంట్లో వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు.

కార్మికులకు మద్దతుగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్ ఆంజనేయ నాయక్, సహాయ కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ కార్మికుల తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్మికులకు మద్దతుగా జనసేన పార్టీ నాయకులు బొర్రా వెంకట అప్పారావు, కొమ్మిశెట్టి సాంబశివరావు, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు జొన్నలగడ్డ విజయ్ కుమార్ మాట్లాడారు. అనంతరం గార్లపాడు బస్టాండ్ సెంటర్ నుండి గాంధీ బొమ్మల సెంటర్, వెంకటరమణ హోటల్ సెంటర్, తాలూకా సెంటర్,పాత బస్టాండ్ సెంటర్, మీదగా మంత్రి అంబటి రాంబాబు క్యాంప్ ఆఫీస్ వద్దకు ప్రదర్శనగా వెళ్లారు. క్యాంప్ ఆఫీస్ లో మంత్రి అంబటి రాంబాబు లేకపోవడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల వస్తున్న సంగతి ముందుగా తెలిసి కూడా లేకుండా పోవడం కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శోభన్‌బాబు సూచనల మేరకు మంత్రి పిఎకు వినతి పత్రం ఇచ్చారు. సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.వీరబ్రహ్మం, షేక్ సైదులు, కె.ఆంజనేయులు, బి.ఏడుకొండలు, షేక్ పెద్దమీరా, జె.రాజకుమార్, పి.మహేష్, ఆర్.సుమన్ పాల్గొన్నారు.



మంత్రి పిఎకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

'వ్యాపారులను ఇబ్బంది పెడుతున్న ఎమ్మెల్యే'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎంతో నమ్మకంతో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే ప్రజలకు సేవ చేయాల్సింది పోయి నియోజకవర్గంలోని ప్రజలను, వ్యాపారస్తులను ఎమ్మెల్యే ముస్తాఫా ఇబ్బందులకు గురిచేస్తున్నారని జనసేన నగర అధ్యక్షులు నేరెళ్ల సురేష్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అసలు నువ్వు ప్రజా ప్రతినిధివా? వీధి రౌడివా అంటూ ముసైఫాపై ఆయన నిప్పులు చెరిగారు. నిషేధిత గుట్కాల వ్యాపారం, కొకైన్ వంటి మాదకద్రవ్యాలు సరఫరాలో వస్తున్న డబ్బులు చాలటం లేదా? అని ధ్వజమెత్తారు. వేలాదిమంది వ్యాపారాలు చేసుకునే వాసవి క్లాత్ మార్కెట్ కాంప్లెక్స్ ప్రవేశ ద్వారానికి అడ్డంగా ముస్తఫా తన యమ్ డీ యమ్ ప్రోడక్ట్స్ షాప్‌ని రాత్రికి రాత్రి పెట్టారన్నారు. నిత్యం రద్దీగా ఉండే వస్త్ర వ్యాపార సముదాయ ప్రవేశ ద్వారానికి అడ్డంగా షాప్ పెడితే తమ వ్యాపారాలకు ఇబ్బంది అని వ్యాపారులు ఎంతగా మొత్తుకున్నా పట్టించుకోలేదన్నారు. వైసిపిని ఎలా గద్దె దించాలో తమకు బాగా తెలుసన్నారు.

ఉప్పరపాలెంలో పొలంబడి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వరిలో ఆకుల కత్తిరింపు అనే రెండు ప్రయోగాలను రైతులకు వివరించారు. పొలంలో పరిశీలించిన మిత్ర పురుగులు, శత్రు పురుగుల నిష్పత్తిని బట్టి ప్రస్తుతానికి వరి పైరుకు ఎటువంటి సస్యరక్షణ చర్యలు అవసరం లేదని చెప్పారు. ఐదు శాతం వేప గింజల కషాయం తయారీ విధానాన్ని వివరించారు. పొలంలో గమనించిన మిత్ర పురుగులు, శత్రు పురుగులను పైరును చార్ట్‌పై చిత్రీకరించి అంతిమ నిర్ణయం రాసి వివరించారు. కార్యక్రమంలో ఏవో డేగల వెంకటరామయ్య, పొలంబడి రైతులు, చలమయ్య, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు

సొంతిల్లు కలేనా?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు 50 వేల ఇళ్లకు నిర్మించిన 25 లేఅవుట్ల కోసం ప్రభుత్వం రూ.180కోట్లతో హడావుడి పనులు ప్రారంభించింది. దాదాపు రూ.88 కోట్లమేరకు పనులు పూర్తి అయ్యాయి. గతనెల 3న హైకోర్టు స్టేతో ఈ పనులన్నీ అధికారులు నిలిపివేశారు. ఇప్పుడు పరిస్థితి మొత్తం తలకిందులు కావడంతో ఈ నిధులతో చేపట్టినపనులన్నీ వృధాయేనని అధికారులు కూడా నొచ్చుకుంటున్నారు. హైకోర్టు తుది తీర్పు వెలువడక ముందే తాము పేదల కోసం న్యాయపోరాటం చేసి విజయం సాధించామని సిఎంజగన్, మంత్రులు జులై 24న వెంకటపాలెంలో జరిగిన సభలో పేర్కొనడం కూడా తీవ్ర వివాదస్పదంగా మారింది. సిఎం, మంత్రుల ప్రకటనలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి ఈ నేపథ్యంలో హైకోర్టు స్టేఉత్తర్వులు ప్రభుత్వ పెద్దలకు మింగుడు పడని పరిస్థితిని కల్పించింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని అదే రోజు ప్రకటించారు.

తాజాగా శుక్రవారం హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను నిలిపివేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించడంతో ప్రభుత్వ వర్గాలు మరింత ఇరకాటంలో పడ్డాయి. అమరావతిపై పట్టు సాధించేందుకు సిఎం జగన్ ఇళ్ల స్థలాల పంపిణీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎన్‌టిఆర్,గుంటూరు జిల్లాల వారికి ఇళ్ల స్థలాలను ఈఏడాది మే 26న సిఎం జగన్ పంపిణీ చేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు పట్టాల పంపిణికి ముందే పట్టాకాగితాలపై కోర్టు తుది తీర్పునకులోబడి హక్కులు ఉంటాయని ముద్రించారు. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణానికి కేంద్రం కూడా నిధులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. అయినా తొలుత రాష్ట్ర ప్రభుత్వనిధులతోనే ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు జులై 24న సిఎంజగన్ మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో శంకుస్థాపన చేశారు. కోర్టు నుంచి ప్రభుత్వానికే సానుకూల నిర్ణయం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కానీ పరిస్థితి తారుమారై పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. చివరికి సుప్రీంకోర్టులోనూ ప్రభుత్వానికి అనుకూల నిర్ణయం రాకపోవడంతో ప్రభుత్వానికి ఇరకాటమైన పరిస్థితి ఏర్పడింది. తమకు మూడేళ్లుగా రాజధానిలో ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆశపెట్టి ఇప్పుడు ఎటూ కాకుండా చేశారని పలువురు 50 వేల మంది లబ్ధిదారులు తీవ్రనిరాశకు గురయ్యారు. కొన్నేళ్లుగా ప్రభుత్వంపై పోరాడుతున్న రాజధాని రైతులకు సుప్రీం నిర్ణయంతో మరింత ఊరట లభించినట్టు అయింది.

ఎన్ఇపితో పేదలకు విద్య దూరం

(మొదటి పేజీ తరువాయి)

విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేస్తుందన్నారు. సిలబస్‌లో మార్పులు చేపట్టి విద్యార్థుల్లోకి మనువాద సంస్కృతిని ఎక్కించాలని ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కర్ణాటకలో బిజెపి అధికారంలో ఉన్నప్పుడు భగత్‌సింగ్ పాఠ్యాంశాన్ని తొలగించటం వారి దేశక్తికి నిదర్శమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఉపాధ్యక్షులు ఎస్‌కె.సమీర్, సుభాష్, మున్నా, జిల్లా సహాయ కార్యదర్శి పవన్, ఈశ్వర్, సంతోష్, బి.సుచరిత పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 164 మందికి అర్హత

ప్రజాశక్తి-గుంటూరు సిటీ : పోలీసు శాఖలో ఎస్ఐ నియామకాల్లో భాగంగా స్థానిక పోలీసుపేరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలలో మహిళల విభాగంలో 164 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్టు ఐ.జి పాల్ రాజు తెలిపారు. మూడు రోజులపాటు మహిళా అభ్యర్థులకు ఈ పరీక్షలు జరిగాయన్నారు. 620 మహిళ అభ్యర్థులు హాజరు కాగా వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ అనంతరం 1600 , 100 మీటర్ల పరుగు, బయోమెట్రిక్, ఎత్తు, బరువు వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు.వీరిలో 164 మంది రాతపరీక్షలకు అర్హత సాధించారు. గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ,తో పాటు ప్రకాశం ఒంగోలు ఎస్పీలు పాల్గొన్నారు.

మంచి చేసే వారిపై తప్పుడు కేసులు

భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : వైసిపి ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో మంచి చేయకపోగా ప్రజలకు మంచి చేసే వారిపై తప్పుడు కేసులు పెట్టిందని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ విమర్శించారు. ఈ నెల 2,3 తేదీలలో ఆత్మకూరులోని హ్యాపీ రిటర్న్స్ నందు బిసివై పార్టీ ఆధ్వర్యంలో ఉద్యోగాల సంబరం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లపై ఆయన శుక్రవారం రిసార్ట్స్ నందు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 50 వేల మంది నిరుద్యోగ యువత యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని సెక్టార్లకు చెందిన 550 కంపెనీలు ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు. పది, ఇంటర్ డిగ్రీ ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనేది లక్ష్యమని హాజరయ్యే ప్రతి ఒక్కరికి భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలో తన సొంత నియోజకవర్గం పుంగళూరులో కార్యక్రమాన్ని నిర్వహిస్తే ఓ మంత్రి పోలీసుల చేత అడ్డుకున్నారని గుర్తు చేశారు. ఈ విధంగా ప్రస్తుతం ఆటంకాలు సృష్టించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. 175 నియోజకవర్గాల్లో వైసిపి గెలుస్తుందని సిఎం చెప్పడం పెద్ద జోక్ అన్నారు. తాము ఒంటరిగా బరిలోకి దిగాలా లేదా పొత్తులు ఉంటాయా అనేది భవిష్యత్తులో నిర్ణయిస్తామని తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించం

ప్రజాశక్తి-నకరికల్లు : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరైనా ఉపేక్షించేది లేదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి రూరల్ సీఐ ప్రేమయ్య హెచ్చరించారు. నకరికల్లు పోలీస్ స్టేషన్ ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ప్రజలతో పోలీసులు మమేకమవ్వాలని, రాజకీయ పార్టీల కవ్వింపు చర్యల్లో పాల్గొని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై బాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

భార్యను వేధించిన.. భర్తపై దాడి..



కత్తి పోట్లకు గురైన జమ్ముల రమేష్, జమ్ముల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

పలుమార్లు తన భార్యను వేధిస్తున్న విషయమై అడిగేందుకు వెళ్లిన భర్త, అతని కుటుంబసభ్యులపై కత్తితో దాడి చేసిన సం ఘటన వట్టిచెరుకూరు మండలంలో చోటు చేసుకుంటుంది. వట్టిచెరుకూరు ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని అనంతవరప్పాడు కి చెందిన జమ్ముల రమేష్, అతని భార్య అనుషను అదే గ్రామానికి చెందిన సురవరపు ఆంజనేయులు గత కొంతకాలంగా వెంట పడుతూ వేధిస్తుండేవాడు. ఈ విషయాన్నీ సుమారు ఐదు రోజుల క్రితం ఆమె తన భర్తకు చెప్పింది. ఈ విషయమై ఆంజనేయులు తమ్ముడు సాంబశివరావు కి రమేశ్ ఫోన్ చేశాడు. అతని అన్న మళ్లీ తన భార్య జోలికి రావద్దని హెచ్చరించాడు. ఈ క్రమంలోనే. గురువారం రాత్రి సుమారు 7:55 గంటలకు సురవరపు సాంబశివరావు, రమేష్‌కి ఫోన్ చేసి ఈ విషయం మాటాడేందుకు గాను అనంతవరప్పాడులోని మాదిగపల్లె వెళ్లే రోడ్డులో ఉన్న జగన్నన్న కాలనీ వద్దకు రావాలని చెప్పాడు. రమేష్, అతని తమ్ముడు వెంకటేశ్వరరావు కలిసి అక్కడికి వెళ్లారు. ఆంజ నేయులు, అతని తమ్ముడు కలిసి వారితో గొడవ పెట్టుకొని, తమ వెంట తెచ్చుకొన్న కత్తితో దాడి చేశారు. ఆంజనేయులు, రమేష్, వెంకటేశ్వరరావుల తలలపై దాడి చేశారు. సాంబశివరావు వారిని గట్టిగా పట్టుకొన్నాడు. ఈ క్రమ ంలో ఈ సమాచారం బాధితుల బంధువులకు చేరడం, వారు అక్కడకు వెళ్లడంతో వారిని చూసి ఆటోలో ఆంజనేయులు, సాంబ శివ రావు అక్కడ నుండి పారిపోయారు. రక్త గాయాలతో ఉన్న రమేష్ , వెంకటేశ్వరరావు ను వారి బంధువులు హాస్పిటల్ కు తీసు కొని వెళ్ళగా చికిత్స చేయించారు. బాధితులు శుక్రవారం పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయడం ఎస్ ఐ కే.వి. కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఒకరు మృతి



ప్రజాశక్తి-విజయపురిసౌత్

గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మాచర్ల మండలం చింతల తండా సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే చింతల తండా చెందిన కేతావత్ శంకర్ నాయక్ (50) గురువారం అర్ధరాత్రి సాగర్ వైపు నడుచుకుంటూ వస్తుండగా సరిగ్గా ఎయిర్ పోర్ట్ ఆర్చి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది.దీనితో శంకర్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అర్ధరాత్రి గొర్రెలను తీసుకెళ్లే వాహనాలు తెలంగాణ రాష్ట్రం నుంచి చింతల తండా వైపు కు భారీగా వెళుతుండటం తో శంకర్ నాయక్ ను ఆ వాహనాలే ఢీ కొట్టి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడిని పోస్ట్ మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న చిన్నారి పాఠశాలలో నుండి బయటకు వచ్చి కష్ణవేణి టాలెంట్ స్కూల్ సమీపంలోని ఇళ్ల వద్ద తిరుగు తుండగా అక్కడివారు పాఠశాల విద్యార్థిని అనుకొని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కు తీసుకువచ్చారు స్కూల్ యాజమాన్యం మా విద్యార్థిని కాదని పోలీసులకు సమాచారం అందించారు పోలీసులు వచ్చి పాపను పోలీస్ స్టేషన్కు చేర్చి పాప విషయంపై విచారణ జరుపుతుండగా తండ్రి విషయం తెలుసుకొని పోలీస్ స్టేషన్కు చేరు కోగా ఎస్సై సౌందర్య రాజన్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ నాయక్ పాపను పాప సింధు ను తండ్రి సుధాకర్ కు అప్ప గించారు శుక్రవారం పాఠ శాల డ్రెస్ కాకుండా సాధారణ దుస్తులు ధరించడంతో ఆ పాప ఏ ఏ ం.ˊ శా ల లో చదువుతుంది అన్నది అర్థం కాలేదు సాధారణ దుస్తులు ధరించే రోజు కూడా పాఠశాలకు సంబంధించిన సింబల్ ఏదైనా పిల్లలు వద్ద ఉండేలా చూడాలని తల్లిదండ్రులు కోరు తున్నారు



రికవరీ చేసిన ఫోన్లు అందజేత



ప్రజాశక్తి -గుంటూరు సిటీ

జిల్లాలో పోగొట్టుకున్న సుమారు రూ.20,50,000/- విలువ గల 101 వివిధ బ్రాండెడ్ కంపెనీల మొబైల్ ఫోన్ లను రోజుల వ్యవధిలోనే రికవరీ చేసి బాధితులకు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ శుక్రవారం అందజేశారు . పోగొట్టుకున్న ఫోన్ ల సమాచారని కంప్లైంట్స్ రూపంలో రిజిస్ట్రేషన్ చేసేందుకై జిల్లాలో ఇటీవల 8688831574 వాట్సప్ నెంబర్ పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చారు. అందులో నమోదు కాబడిన వివరాల ప్రకారం ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా భారీగా మొబైల్ ఫోన్లు రికవరీ చేసి ఫోన్ యజమానులకు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు అందజేశారు. సిఇఐఆర్ సిటిజెన్ పోర్టల్ ద్వారా ఫోన్ లు పోయిన వెంటనే పోర్టల్ నందు ఫిర్యాదు చేస్తే సెల్ ఫోన్ లో ఉన్న సమాచారం దుర్వినియోగం కాకుండా సెల్ ఫోన్ బ్లాక్ అవుతుందని, దానిద్వారా వెంటనే రికవరీ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఇతర జిల్లాల నుండి గుంటూరు జిల్లాకు వచ్చి ఫోన్లు పోగొట్టుకునే ప్రయాణికులు కూడా ఈ మొబైల్ వాట్సప్ సేవలు వినియోగించుకోవాలన్నారు .



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 15,010
మిర్చి ఎగుమతి	: 17,251
మిర్చి నిల్వ	: 9,797

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 22,000
నెం.5	9,000 - 21,500
273	10,000 - 19,000
341	10,500 - 22,000
సూపర్ 10	17,000 - 17,000
నాన్ ఎసి	
తేజ	9,500 - 24,200
బడిగి	12,500 - 25,000
దేవనూరు డీలక్స్	20,000 - 20,500
తాలుకాయలు	6,000 -14,000
ఎసి	
334	12,000 - 20,000
341	18,000 - 22,000
4884	11,000 - 11,000
తేజ	13,000 - 21,500
బడిగి	16,000 - 26,000
దేవనూరు డీలక్స్	18,000 - 21,000
తాలుకాయలు	7,000 -13,000

మూడో విడత రీసర్వేను ప్రారంభించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



మండలంలో మూడోవ విడత భూముల రీసర్వేను త్వరితగతిన ప్రారంభించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో వీఆర్వో లు గ్రామ సర్వేయర్ల తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండ లంలో 12 గ్రామాల్లో భూములు రీసర్వే పనులు ప్రారం భించాలని జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని సూ చిం చారు. కార్యక్రమంలో ఆర్డీవో బి ఎల్ ఎన్ రాజకుమారి తహశీల్దార్ సురేష్ గ్రామ సర్వేయర్ల వీఆర్వో ల పాల్గొన్నారు.

మండలంలో రీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలములో తొలి విడతగా ప్రారంభించాలనీ జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. మండల తహ శీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి విడతగా మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు, లంకెలకూరపాడు, ముప్పాళ్ల, మాదల గ్రామాలలో రీ సర్వే వెంటనే ప్రారంభించవలసినదిగా ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామ సర్వే సిబ్బందే కాకుండా తహ సిల్దార్,ఎంపిడివో,మండల సర్వేయర్,డిప్యూటీ తహశీల్దార్,గ్రామ రెవిన్యూ అధికారులు,గ్రామ సచివాలయ సిబ్బంది,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు,వాలంటీర్లు,పంచాయతి కార్యదర్శులను కూడా భాగస్వాములు చేయాలని ఆయన అన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామములో గ్రామ సభలను నిర్వ హించి రైతులకు అవగాహనా కార్యక్రమము నిర్వహించామని ఒకటి రెండు రోజులలో వాలంటీర్ల ద్వారా రైతులకు నోటీసులు ఇచ్చి అందరి సమక్షములో సర్వే ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.

దుర్గి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

ప్రజాశక్తి-దుర్గి

దుర్గి మండలం పోలీస్ స్టేషన్ ను శుక్రవారం గురజాల డిఎస్పి పల్లపు రాజు ఆకస్మింగంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా స్టేషను పరిశీలించి అనంతరం స్టేషన్లో ఉన్న పెండింగ్ కేసుల గురించి ఎస్సై శివాను అడిగి తెలుసుకున్నారు. సంబంధించిన రికార్డులను స్వయంగా పరిశీలించి వాటిపై ఆరా తీశారు ఈనెల 9వ తేదీన మాచర్ల కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్లో రాజీ కేసులను సిద్ధం చేయాలన్నారు. వచ్చే ఎన్నికలు దష్టిలో పెట్టుకొని పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కారానికి మార్గాలు చూపాలని ఎస్సై శివకు,సీఐ దార్ల జయకుమార్ కు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 63 యాక్సిడెంట్ దొంగతనాలు కేసులు రెండు మిస్సింగ్ కేసులు మూడు ప్రాపర్టీ కేసులు పెండింగ్లో ఉన్నాయన్నారు.

ప్రజలతో మమేకం కావాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ప్రజలతో మమేకం అవ్వాలని సతైనపల్లి రూరల్ సిఐ ప్రేమయ్య అన్నారు.ముప్పాళ్ల పోలీసు స్టేషన్ శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలనీ ఇన్చార్జ్ ఎస్ఐ కిషోర్ బాబు కు సూచించారు.

వాహనాలు సీజ్

ప్రజాశక్తి-బెల్లంకొండ

బెల్లంకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నాటు సారాయి, తెలంగాణ మద్యం రవాణా చేయుటలో ఉపయోగించిన మోటార్ సైకిల్ వాహనములను ను సీజ్ చేయడం జరిగిందని సీజ్ చేసిన వాహనములను 2023 సెప్టెంబర్ 5 వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు బెల్లంకొండ పోలీస్ స్టేషన్ లో వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి గల వ్యక్తులు వేలం పాటలో పాల్గొనవలసిందిగా బెల్లంకొండ మండల ఎస్సై కె.అమీర్ తెలిపారు.

'రెండో వివాహం చేసుకున్నాడు'

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

మొదటి వివాహం అయింది అని చెప్పకుండ రెండవ వివాహం చేసుకొని ఇప్పుడు మోహం చాటేస్తున్నాడు అని మహిళ పిర్యాదు చేసిన సంగటణ ప్రత్తిపాడు మండల కేంద్రం లో చోటు చేసుకుంది.ఎస్ ఐ తెలిపిన వివరల ప్రకారం షేక్ అస్మా ప్రతిపాడు మండలం, గ్రామం.పూల వ్యాపారం చేసుకుంటు జీవనం సాగిస్తుంది. నర్రా నగేష్ (భర్త) ఆర్టీసీ బస్ కు ప్రవేట్ డ్రైవర్ పనిచేస్తున్నట్లు, ఫిర్యాదుకి వివాహం జరగక ముందు గత సంవత్సరం అనగా 2022లో బస్సులో నగేశ్ పరిచయమై నెంబర్ తీసుకొని మాట్లాడుతూ నిన్ను పెళ్లి చేసుకుంటాను అని తనకు ఇంకా పెళ్లి కాలేదు అని నగేశ్ చెప్పగా , ఫిర్యాది నమ్మి తన కుటుంబ సభ్యుల కు చెప్పగా ఫిర్యాదు కుటుంబ సభ్యులు నగేష్ ని వాళ్ళ కుటుంబ సభ్యుల గురించి అడగగా తనకి ఎవరూ లేరని చెప్పగా ఆ మాటలు నమ్మి నేను గత సంవత్సరం తాను నగేశ్ నీ పెద్దల సమక్షంలో వివాహం చేసుకోగా, తమకు ఒక అబ్బాయ్ సంతానం కలిగింది. వివాహం కొత్తలో మొదట బాగా చూసుకుని ఇంటికి వచ్చేవాడు తర్వాత ఇంటికి సరిగా రాకపోవడం గమనించి ఫిర్యాదు తన భర్తని అడగ్గా భర్త నగేశ్ గొడవ పెట్టుకొని అనుమానంతో నన్ను మానసికంగా శారీరకంగా హింసించేవాడు. అను మానంతో విచారించి నిలదియ్యగ 2014లో తన కంటే ముందే మరొక వివాహం చేసుకున్నట్లు , ఆ వివాహాన్ని చెప్పకుండా దాచిపెట్టినట్లు చెప్పినాడు. అస్మ మోసపోయినట్టు తెలుసుకొని ప్రతిపాడు పోలీస్‌స్టేషన్‌ల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

లాలాపేట పోలీసులు వేధింపుల తాళలేక ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. లాలాపేట ప్రాంతంలో ఒక వైన్ షాపు వద్ద ఇద్దరు యువకుల మధ్య వివాదం ఏర్పడింది. ఈ నేప ధ్యంలో సలాం అనే యువకుడిపై సాయి అనే యువకుడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సలాం ను స్టేషన్ కు పిలిచి కానిస్టేబుల్ రత్నరాజు తీవ్రంగా కొట్టాడని ఇందుకు మనస్తాపానికి గురైన సలాం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సలాం పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సలాం ను పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తా న్ వలీ శుక్రవారం రాత్రి పరామర్శించారు. లాలాపేట పోలీసుల తీరు పట్ల మస్తాన్ వలీ ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎర్రబాలెంలో రైతుతో మాట్లాడుతున్న జి రవిబాబు

కోతలు లేకుండా విద్యుత్ ఇవ్వండి

ప్రజాశక్తి-క్రోసూరు

వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయ విద్యుత్తును కోతలు లేకుండా 9 గంటలు ఇవ్వాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. సిపిఎం దేశ వ్యాప్తంగా ధరలపై ఇచ్చిన సమరభేరి కార్యక్రమంలో పాల్గొని వర్షాభావ పరిస్థితుల్లో రైతాంగం పరిస్థితిని తెలుసుకోవటానికి మండలంలోని ఎర్రబాలెంలో పంట పొలాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. నీరు పుష్కలంగా ఉన్న కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నామని, ఎకరానికి రూ. 20,000 నుంచి రూ.30,000 వరకు ఖర్చు పెట్టామని, మూడు గంటలు మాత్రమే వ్యవసాయానికి కరెంటు ఇస్తున్నారు, ఫోన్ చేసి అడిగితే ఫోన్ పక్కన పెడుతున్నారని లేదా పైనుంచి ఆగిపోయింది తాము ఏమి చేయలేమని మిర్చి రైతులు చెప్పారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ శివారులో గోదావరి-పెన్నా నదుల అనుసంధాన పథకం కోసం తీసిన బావిలో పుష్కలమైన నీరు ఉందని ఆ బావి పరిసర ప్రాంతాల్లో సుమారు 70,80 ఎకరాల మిర్చి,అదే విధంగా వందల ఎకరాల ప్రత్తి,ఇతర పంటలు సాగు చేశామని తెలిపారు. పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ఆ నీటిని పంట పొలాలకు పెట్టి పంటలను కాపాడుకుందాం అంటే కోతలతో కూడిన వ్యవసాయ విద్యుత్తుతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. అదేవిధంగా రోజుకి మూడు, నాలుగు గంటలు మాత్రమే కరెంటు ఉండటం వలన రోజుకి మూడు ఎకరాలకు సాగు నీటిని పెట్టాల్సి ఉంటే ఒక ఎకరానికి మాత్రమే నీరు పెట్టగలుగుతున్నామని తెలిపారు. రవిబాబు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతాంగం పంటలను కాపాడుకోవడానికి కోతలు లేకుండా9 గంటలు కరెంటును ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్రకటిత కరెంటు కోతలతో రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఇదే పరిస్థితి కొనసాగితే వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతాంగం ఆగ్రహానికి ఈ ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని, హెచ్చరించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో కృష్ణా నదిపై ఉన్న లిఫ్టు ఇరిగేషన్ స్కీముల ద్వారా అవకాశం ఉన్న అన్ని చెరువులు, కుంటలను కృష్ణానది నీటితో నింపి రైతాంగాన్ని ఆదు కోవటానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యుల నంబూరు శంకర్రావు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హను మంతరావు నాయకులు ఐలం గోపాలకృష్ణ పాల్గొన్నారు.



రాంగ్‌రూట్‌లో స్కూల్ బస్!

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పట్టణంలోని ఓ ప్రముఖ స్కూల్ బస్ శుక్రవారం సాయంత్రం చిన్నారులను ఎక్కించుకొని రాంగ్‌రూట్‌లో వెళుతుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. వినుకొండలోని ఆ పాఠశాలకు సమీపంలో ఉన్న బస్టాండ్ కు వచ్చే పోయే వాహనాలతో ఆ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. సరైన మార్గం ఉన్నప్పటికీ వాహనాలకు ఎదురుగా వెళ్లడంపై విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ విషయమై పాఠశాల బస్సు డ్రైవర్‌ను నిలదీస్తే ఇదంతా మాములే అన్నట్లు నిర్లక్ష్యంగా సమాధానం చెప్ప డంతో స్వల్ప వివాదం చోటుచేసుకుంది.

ప్రజలపై ధరల మోత.. పన్నుల భారం..

ప్రజాశక్తి-సత్తెనపలి

విద్యుత్ చార్జీలు,పెట్రోలు,డీజిల్, ధరలు ఇతర నిత్యావసర వస్తువులు ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్ అన్నారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమం శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను, పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందని, రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబట్టాలని ఆదేశాలు జారీ చేస్తోందని అన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తూ ఆ విధానాల్ని అత్యుత్సాహంతో అమలు చేస్తూ ప్రజలపై పనుల భారాన్ని మోపుతున్నారని అన్నారు. నిరసన,సంతకాల సేకరణ, సచివాలయాలకు వినతిపత్రాలు సమర్పణ, మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు గుంటూరు మల్లేశ్వరి, పెండ్యాల మహేష్, గుంటుపల్లి బాలకష్ణ, పట్టణ కమిటీ సభ్యులు అనుముల వీర బ్రహ్మం ,జడ రాజ్ కుమార్, ఏ వెంకటనారాయణ, పొట్టి సూర్య ప్రకాశరావు, కోట సాయికుమార్, డి.అమూల్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సమరభేరి ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. సమరభేరి ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య పరుస్తున్నామని సిపిఎం రొంపిచర్ల మండల శాఖ కార్యదర్శి కామినేని రామారావు అన్నారు. మండల కేంద్రం రొంపిచర్ల గ్రామ సచివాలయ ఎదుట నిరసన తెలిపి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ పోలయ్యకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు, సిపిఎం నాయకులు ఆకుల నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బత్తుల బాలకోటయ్య, రైతు సంఘం నాయకులు గాలి వీరయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక 12వ వార్డులో ప్రచారం చేస్తు సమస్యలను అడు గుతూ, సంతకాలను సేకరిస్తూ,కరపత్రాలను పంచుతున్నా మని పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం విద్యుత్ చార్జీలు అధిక ధరలకు వ్య తిరేకంగా ఈ నెల 4వ తేదీ వ రకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం 8 వ నంబరు సచివాలయంలో అడ్మిన్ ఆనంద బాబుకు సమస్యల పరిష్కరించాలని కోరుఉ 179 మంది సంతకాలు చేసిన వినతిపత్రం అందచేశారు. లూథరన్ చర్చి వెనుక ఉన్న చెరువు వల్ల పాములు,దోమలు,విష జంతువులు వస్తు న్నాయని 12వ వార్డు ప్రజలు విన్న వించా రనివాటి నివారణకు కనీసం బ్లీచింగ్,ఫాగింగ్ చేయాలని,ఆ చెరువు చుట్టూ పల్లెవాసులు వాకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని,దాని చుట్టూ కంచె వేయాలని, చర్చి వద్ద తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే తగు చర్యలు తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సాతులూరి లూథర్, సాతులూరి జెమ్స్, తియ్యగుర ప్రతాప్‌రెడ్డి, సాతులూరి బాబు, ఎం.విల్సన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ

మండలంలోని మాదల,ముప్పాళ్ల గ్రామాల్లో సమంభేరి ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ పాల్గొన్ని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రతి ఒకరు పొరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పథకాలు అంటూ ఒక చేత్తో ఇస్తూ ధరలు పెంచి మరో చేత్తో లాగేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం మాదల గ్రామ సచివాలయం వద్ద పంచాయతి కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయ కులు గారా జాలయ్య, తొరటి అమరలింగేశ్వరరావు, నరసింహారావు,పటాన్ సైదా ఖాన్,మార్పుల వెంకట్ రెడ్డి ,ఇందూరి సత్యనారాయణ రెడ్డి,కంచర్ల నాగేశ్వరావు,తోట బ్రహ్మయ్య ,తోట వెంకటేశ్వర్లు,ఇందూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్


సెప్టెంబర్ 5 వరకు సిపిఎం ఆధ్వర్యంలో జరిగే సమరభేరిలో భాగంగా మండలంలో ఫణిదంలో ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి వీరాంజనేయులు కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ పెండ్యాల మహేష్ పాల్గొన్ని మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 1వ తేదీ నుండి నాలుగో తేదీ వరకు సచివాలయలు దగ్గర అందోళన చేపడతామని, 5 వ తేదీ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫణిదం సిపిఎం సీనియర్ నాయకులు రావూరి పూర్ణచంద్రరావు, షేక్ హుస్సేన్ షా,ఎస్ కే జాను, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, విద్యార్థి సంఘం నాయకులు కోటా సాయికుమార్,దుగ్గి అమూల్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-క్రోసూరు

పెరికపాడు, దొడ్లేరు, యర్రబాలెం గ్రామ సచివాలయాల్లో అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు మాటాడారు. అన్నారు. దొడ్లేరు సచివాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఆవులు ఆంజనేయులు మాట్లాడారు.స్మార్ట్ మీటర్లు బిగించడం,సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని తదితర డిమాండ్లు చేశారు.



ఫణిదంలో సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న చిత్రం



చిలకలూరిపేటలో..



క్రోసూరులో..



మాచర్లలో..



రొంపిచర్లలో..



ముప్పాళ్లలో..

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక సిపిఎం శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులో వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మాచర్ల డివిజన్ నాయకులు బండ్ల మహేష్ మాట్లాడుతూ సాధించుకున్న హక్కులు పోతున్నాయని ప్రజల సంఘటితమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేష్,మహేష్ వెంకటరత్నం శోభన్ కుమార్ నాయకులు రాజు జ్యోతిష్, వేముల వెంకట్రావు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్పి స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించండి

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని ఎన్ఎస్పి స్థలంలో ప్రభుత్వం ఇచ్చిన 146 జీవో ను అనుసరించి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు జరపాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే. హనుమంత్ రెడ్డి డిమాండ్ చేశారు. పుతుంబక వెంకటపతి భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ పురపాలక సంఘం ఎన్ఎస్పి ఖాళీ స్థలంలో వ్యాపార సముదాయాల నిర్మాణ విధానం సరైంది కాదన్నారు. వ్యాపారాల వద్ద నుండి డబ్బు తీసుకొని ఒక్కొక్క షాపు 12 నుంచి 15 లక్షలు వరకు వేలం పాట ద్వారా కేటాయింపు విధానం చూస్తే సరైనదిగా లేదని, గతంలో ఎన్ఎస్పి కాలనీ ముందు భాగంలో దశాబ్దాల నుంచి జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హనుమంత్‌రెడ్డి

షాపింగ్ ఇస్తామని హామీ ఇచ్చి వారిని అక్కడ నుంచి ఖాళీ చేయించి నేడు మున్సిపాలిటీ నిర్ణయించిన గుడ్ విల్ కు లక్షలు చెల్లించిన వారికే షాపులు కేటాయింపు ద్వారా చిరు వ్యాపారులకు అన్యాయం జరుగుతుందన్నారు. కాబట్టి ఎన్ఎస్పి ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం సరైంది కాదని సిపిఎం భావిస్తుందన్నారు. ఎన్ఎస్పి నుండి వినుకొండ మున్సిపాలిటీకి సుమారు 21 ఎకరం బతలాయింపు ద్వారా అప్పగించి ఆ స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు వ్యవసాయ శాఖ, వెలుగు, ఎక్సైజ్, లైబ్రరీ, షాదీ ఖానా, అవుట్డోర్ ,ఇండోర్ స్టేడియం పార్క్ తదితర నిర్మాణానికి అనుమతిస్తూ 146 జీవోను విడుదల చేసిందని ప్రస్తుతం వినుకొండ మునిసిపాలిటీ అందరూ భిన్నంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు చేపట్టి ఆ తర్వాత గుడ్ విల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై అఖిలపక్ష పార్టీలతో సమావేశం కూడా త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వరరావు, నాసర్ బి, తిరుమల లక్ష్మి, రంజాన్ బి, ముని వెంకటేశ్వర్లు ఉన్నారు.

సచివాలయాల వద్ద సిపిఎం ధర్నా







ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి లో భాగంగా మంగళగిరి మండలం ఆత్మకూరు సచివాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని బిజెపి హామీనిచ్చిందని, అధికారానికి వచ్చిన తర్వాత ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పైగా ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి ఉన్న ఉద్యోగాలను తొలగిస్తూ కార్మికుల పొట్ట కొడుతోందన్నారు. పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్యుడిని బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్యాస్‌ను రూ.1200 చేసి రూ.200 తగ్గించి గొప్పలు చెప్పుకుంటున్న తీరు చూస్తుంటే 'దారిదోపిడి చేసి దారి ఖర్చులకు చిల్లర ఇచ్చినట్లు ఉంది' అని విమర్శించారు. నిత్యావసర వస్తువులను కృత్రిమ కొరత సృష్టించి ధరల పెరుగుదలకు కారణమైన కార్పొరేట్ సంస్థలపై దాడులు చేయించకుండా వారి ప్రయోజనాలను కాపాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారానికి రాకముందు తాను అధికారానికి వస్తే కరెంటు చార్జీలు పెంచబోము అని చెప్పి ఇప్పుడు వివిధ రూపాల్లో ఏడుసార్లు పెంచారని తెలిపారు. మరోవైపు చెత్త పన్ను పేరుతో కార్పొరేషన్ అధికారులను ఉసిగొలిపి పేదల శ్రమను దోస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీకి నిరసనగా జరిగే పోరాటాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని, మండల కార్యాలయాల వద్ద 4వ తేదీన జరిగే ధర్నాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మాజీ వైఎస్ ఎంపిపి ఎం.పకీరయ్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా చెత్తకు పన్ను వసూలు చేస్తున్న ప్రభుత్వం ఉందంటే అది ఆంధ్రప్రదేశ్‌లోని వైసిపి ప్రభుత్వమేనన్నారు. వాలంటీర్ల ద్వారా ఏడాది పన్ను మొత్తం వసూలు చేయిస్తున్నారని, పన్ను చెల్లించకుంటే సంక్షేమ పథకాలు కట్ చేస్తామంటూ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. చెత్త పన్ను వసూలు చేయొద్దని ఎమ్మెల్యే చెప్పిన అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, ఎవరూ చెత్తపన్ను చెల్లించొద్దని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు.దుర్గారావు, సిహెచ్.జనార్ధనరావు, వి.సాంబశివరావు, పి.ప్రసాదు కె.ఆంజనేయులు, జి.అజయ్‌కుమార్, డి.పద్మనాభశర్మ, సిహెచ్.సీతారామాంజనేయులు, బి.రాంబాబు, వి.రామారావు, సిహెచ్.గిరిధరరావు, వి.సుబ్రహ్మణ్యం, జి.లక్ష్మి, వి.సురేష్, కె.లక్ష్మి, ఎం.శ్రీను, స్థానికులు పాల్గొన్నారు

చిన్నకాకానిలో ప్రచారం నిర్వహించగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు మాట్లాడారు. లాభాల్లో నడుస్తున్న ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ఆదాని అంబానీలకు అప్పచెబుతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కస్టమర్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో విపరీతమైన భారాలు వేస్తున్నరని తెలిపారు. మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెత్త పన్ను విపరీతంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, చెత్త పన్ను రద్దు చేయాలని, కరెంటు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద 4వ తేదీన జరిగే ధర్నాకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.శివశంకరరావు, కె.సాంబశివరావు, పి.సుబ్బారావు పాల్గొన్నారు. బాబూజీ నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.భాగ్యరాజ్ మాట్లాడారు.

ప్రజాశక్తి మంగళగిరి : చెత్త పన్నును ఎత్తివేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం పాత మంగళగిరి 15వ వార్డు సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వై.కమలాకర్ మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లేసుకుని నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలివ్వాలని, డిమాండ్ చేస్తూ సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎస్.కోటేశ్వరరావు, డి.జనార్ధన్, డి.గంగాధర్, శివపార్వతి, సుబ్బులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాల, చిలువూరు, తుమ్మపూడి, మంచికలపూడి గ్రామాల్లో కార్యదర్శులకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రాలిచ్చారు. తుమ్మపూడిలో తరచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారని, విద్యుత్ బిల్లులలు అధికంగా వస్తున్నాయని, నిర్మాణం పూర్తయిన వాటర్ ట్యాంక్‌ను ఉపయోగంలోకి తేవాలని అర్జీలిచ్చారు. దుగ్గిరాలలో గుంతల మయంగా మారిన ప్రధాన రహదారితో పాటు స్థానిక సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు, ఎన్.యోగేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, జి.శ్రీనివాసరావు, వై.బ్రహ్మేశ్వర పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ : స్థానిక సచివాలయంలో అధికారులకు విన్నవించారు. కె.పూర్ణచంద్రరావు, సిహెచ్.భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి : పట్టణంలోని 23, 24, 28,27 వార్డు సచివాలయాల అడ్మిన్‌లను కలిసి, సమస్యలు వివరించి, వినతిపత్రాలు ఇచ్చారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని, దీనికి తోడు విద్యుత్ ఛార్జీలను పెంచేసి ప్రజలపై ప్రభుత్వం భారం మోపిందని అన్నారు. మరోవైపు ఉపాధి అవకాశాలు కొరవడ్డాయన్నారు. ఉపాధి లేక, ధరల భారంతో సతమతమవుతున్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్, పి.జోనేష్, ఏసోబు, రాజ్యలక్ష్మి, ఎస్‌కె ఆశాభి పాల్గొన్నారు.















ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్ : పెదనందిపాడు, వరగాని, నాగులపాడు సచివాలయాల అధికారులకు సిపిఎం నాయకులు వినతిపత్రాలు ఇచ్చారు. నాగులపాడు గ్రామ కూడలిలో విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు మాట్లాడారు. నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, కె.వెంకటశివరావు, సిహెచ్.యానాదులు, కె.వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు : ంండల కేంద్రమైన చేబ్రోలులో కరపత్రాలను పంపిణీ చేశ్శారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చేనాటికి దేశంలో నిరుద్యోగం 4 శాతం ఉంటే నేడు ఏడు శాతానికి పెరిగిందనిన్నారు. కార్యక్రమంలో హనుమంతరావు, అది శేషు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : స్థానిక గ్రంథాలయం సెంటర్‌లో ప్రచారం చేశారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడారు. పి.బాబురావు, కె.వెంకటేశ్వర్లు, బి.శ్రీను, కె.నరేంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు బి.రామకృష్ణ మాట్లాడారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం : పొనుగుపాడు, ఫిరంగిపురంలో ప్రచారం చేశారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్‌ఎం వలి, నాయకులు సి.హెచ్. నాగమల్లి మాట్లాడారు. విద్యుత్ బిల్లు ప్రతులను దహనం చేశారు. వై.నాగేశ్వరరావు, వై.కృష్ణమూర్తి, ఎన్.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకట్రావు, వెంకట శివ, వెంకయ్య, టి.వీరయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : తహశీల్దార్ కార్యాలయం వద్ద 4వ తేదీన ధర్నాకు ప్రజలు తరలిరావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గాదె సుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని పద్మశాలీయ బజార్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డి.కోదండరామయ్య, యు.వీరాంజనేయులు, కోటి రామ్మూర్తి పాల్గొన్నారు. కొత్తూరులో కరపత్రాలు పంపిణీ చేశారు. డివి భాస్కరరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. పెనుమాకలో అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, ఎస్‌కె పీరూసాహెబ్ పాల్గొన్నారు. ఉండవల్లిలో పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వి.వెంకటేశ్వరరావు, ఎస్.ఇమ్మానుయేలు రాజు, బక్కిరెడ్డి, జి.బోసురెడ్డి, టి.శివయ్య, యు.పార్థసారధి, గాంధీ, కె.రామకృష్ణ పాల్గొన్నారు. 11, 12 సచివాలయాల్లో అర్జీలు అందజేశారు. వి.దుర్గారావు, వెంకన్న, హసీనా, మల్లేశ్వరి, చంటి, సర్దార్, బాబావలి, బేగం, ఇక్బాల్ పాల్గొన్నారు.

నేటి నుండి తాగునీటి సరఫరా యథాతథం

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో చేపట్టిన తాగునీటి పైపులైను పనుల మరమ్మతు పనులు శుక్రవారం పూర్తి అయ్యాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో శనివారం ఉదయం నుండి నీటి సరఫరా పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువుకు ముందే పనులు పూర్తి చేసినందుకు అధికారులకు కమిషనర్ అభినందనలు తెలిపారు.



యార్డులో మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ పరిశీలన

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ ఉద్యోగులు శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డును పరిశీలించారు. పసుపు పంట పరిశీలనతో పాటు ఈ-నామ్ అమలు తీరు, క్రయ విక్రయాలు తదితర అంశాలపై యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఎన్.శ్రీనివాసరావు ద్వారా తెలుసుకున్నారు. వీటితోపాటు రైతులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, రైతుబంధు పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఎంఐ శ్రీనివాసరావు ఫణికుమార్, యార్డు చైర్మన్ షేక్ బాజీ పాల్గొన్నారు.



టిఫిన్ బండ్లు అందజేస్తున్న వైసిపి నాయకులు

తోపుడుబండ్లు, టిఫిన్ బండ్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా తాడేపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి 15 టిఫిన్ బండ్లు, 11 తోపుడు బండ్లు, రెండు ప్లాట్‌ఫారం రిక్షాలు అందజేశారు. పట్టణంలోని క్రిష్టియన్‌పేట వైసిపి కార్యాలయంలో తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వేణుగోపాలసోమిరెడ్డి ఆధ్వర్యంలో వీటిని అందించారు. బ్రహ్మానందపురం, ప్రకాష్‌నగర్, ముగ్గురోడ్డు, సలాం సెంటర్, మహానాడు, ఒకటో వార్డు, అమరారెడ్డినగర్ ప్రాంతాలకు చెందిన పేదలకు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు, వెంకటరామిరెడ్డి, ఎం.ప్రకాష్, అనిల్, దాసు, రుక్మాంగరెడ్డి, సంపూర్ణ పార్వతి, ఉదయరాజు పాల్గొన్నారు.



తోపుడు బండిని అందజేస్తున్న టిడిపి నాయకులు

తోపుడుబండి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని మూడో వార్డుకు చెందిన పగడాల నాగమణి చిరు వ్యాపారం నిర్వహించుకునేందుకు టిడిపి నాయకులు శుక్రవారం తోపుడుబండి అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, మండల గోపాలరావు, పాండు రంగారావు పాల్గొన్నారు.

దూర విద్యా విధానం ఎంతో ఉపయోగకరం

ప్రజాశక్తి - మాచర్ల



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో దూర విద్యా విధానంపై అవగాహన సదస్సు జరిగింది ఈ కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు కలెక్టర్ మాట్లాడుతూ అనివార్య కారణాల వలన చదువుకునే వయసులో విద్యకు దూరమైన వారు దూర విద్యా విధానం ద్వారా విద్యావంతులు కావచ్చు అని తెలిపారు. ప్రభుత్వం దూర విద్యా విధానానికి ప్రాధాన్యత నిస్తూ విద్యకు దూరమైన వారికి మేలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు సచి వాలయాల సెక్రటరీలు గ్రామీణ ప్రాంతాలలో విద్యకు దూరంగా ఉన్న వారిని ఎంపిక చేసి దూర విద్యా విధానం ద్వారా చదువుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి తెలియజేయాలన్నారు. సెలవు దినాల్లో మాత్రమే వారికి పాఠశాల నడుస్తుందని అన్నారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ అక్బర్ అలీ హుస్సేన్ ఎంఈఓ నాగయ్య పాఠశాల హెచ్ఎం రామారావు తదితరులు పాల్గొన్నారు

'అత్తలూరు ఆర్గానిక్'కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ సారథ్యంలో పల్నాడు జిల్లా అమరావతి మండలానికి చెందిన అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజర్స్ కు 2023 ఏడాదికి సంబంధించి ప్రకతి వ్యవసాయ మార్కెట్ రైతు ఉత్పత్తిదారుల సంఘం జైవిక్ ఇండియా జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె .అమలుకుమారి పత్రికా ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 7వ తేదీన బయో ప్యాచ్ ఇండియా నేచురల్ ఎక్స్ ప్రో న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమానికి అత్త లూరు రైతు ఉత్పత్తి దారుల సంఘానికి అధ్యక్షులు అయిన జిల్లా కలెక్టర్ శివ శంకర్, ఈ జాతీయ అవార్డును న్యూ ఢిల్లీ లో స్వీకరిస్తారని పేర్కొన్నారు.


సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్,యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు

మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి విద్యార్థి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల తిరుమల ఇంజనీరింగ్ శుక్రవారం బి.టెక్ మొదటి ఏడాది విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ఫౌండర్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ విద్యార్థులను వారి తల్లితండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాలలోని సౌకర్యాలు, ప్రయోగశాలలు భావవ్యక్తీకరణ, పర్సనాలిటీ డెవలప్మెంట్,సాఫ్ట్ స్కిల్స్ పెంపొందుటకు డిజిటల్ తరగతులు, కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో విద్యాభివద్ధికి పాటు పడాలనే లక్ష్యంతో కళాశాల స్థాపించామని లాభాపేక్షకు తావులేకుండా ఉన్నత ఆశయాలతో నడుపుతున్నామన్నారు.అనంతరం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ నలబోతు వెంకట్రావు, వివిధ విభాగాల అధిపతులు, టి జగదీష్, టిపిఓ సాంబశివరావు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా గృహ నిర్మాణాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నిర్దేశిత గడువులోగా గృహ నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ స్థానిక నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని బి.ఆర్. అంబేద్కర్ స్పందన హాలులో గృహ నిర్మాణ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల గహ నిర్మాణాలు చేపట్టాలని ఆయన సూచించారు. అదేవిధంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని దినాలను మరింత పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అసిస్టెంట్ ఇంజనీరు తమ పురోగతిని తెలియజేసే విధంగా నివేదికలను సంబంధిత ఎంపీడీవోలకు ప్రతి శనివారం అందించాలన్నారు. లక్ష్య సాధనలో అలసత్వం వహించవద్దని అన్నారు.. ఐ హెచ్ హెచ్ ఎల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి పురోగతిలోకి రావాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. గహ నిర్మాణాల ప్రక్రియలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. కలెక్టర్ ఎల్. శివ శంకర్ మాట్లాడుతూ ఇప్పటివరకు బేస్మెంట్ లెవెల్ నుండి పై వరకు 60 శాతం పనులు పూర్తయ్యాయని బిలో బేస్మెంట్ లెవల్ పనులు 19 శాతం పూర్తయ్యాయని అదేవిధంగా యు డి ఐ, యు ఎల్ ఆర్ పనులు 21 శాతం పూర్తయ్యాయని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వివరించారు. ఇకపై జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని రోజులు పెంచేలా, ఐహెచ్హెచ్ఎల్ పై దృష్టి సారించి పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి బుధవారం నిర్వహించే క్షేత్రస్థాయి పరిశీలనలో హౌసింగ్ శాఖపై దృష్టి సారించి గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన హౌసింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్

అదేవిధంగా మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి లబ్ధిదారులు అవగాహన కల్పించాలన్నారు. లేఅవుట్ల వద్ద సుందర ఆర్చీల నిర్మాణానికి పరిపాలన అనుమతుల కూడా అందజేశామని, మిగిలిన వాటికి రెండు నెలల లోపల పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. మ్యాజిక్ సోప్ పిక్స్ ఏర్పాట్లు అవసరమైన జాగ్రత్తలు తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. సమీక్షల హౌసింగ్ శాఖ ఈఈ శివలింగం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేతన్నలకు అందిస్తున్న పథకాలపై అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎల్. శివ శంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం స్థానిక నరసరావుపేట భువనచంద్ర టౌన్ హాల్లో టెక్స్టైల్స్ శాఖ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు పింఛన్ ఇవ్వడంతో పాటు నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ 24 వేలు ఆర్థిక సహాయాన్ని మగ్గం వేసే వారికి అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హ్యాండ్లూమ్స్ డెవలప్మెంట్ ద్వారా క్లస్టర్లు ఏర్పాటు చేసి వనేతన్నలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని తెలిపారు. జిల్లాకు సంబంధించి 200 నుంచి 250 మందితో ఇప్పటివరకు 3 క్లస్టర్లు చిలకలూరిపేట, నరసరావుపేట, మాచర్లలో ఉన్నాయన్నారు. మరో 2 క్లస్టర్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అందులో చిలకలూరిపేటకు ఒకటి మంజూరు కాగా వినుకొండ నియోజకవర్గం ఆరేపల్లి ముప్పాళ్ళ లో క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఒక్కొక్క క్లస్టర్ కు రూ 2 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించి అందులో షెడ్ నిర్మాణం, ముడి సరుకు అందుబాటులో ఉండేలా దీనిని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. క్లస్టర్ బయటి వారికి రూ 1.25 లక్షల వంతున వ్యక్తి గతంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. 250 మంది నేతన్నలు ఉండి షెడ్డు ఏర్పాటు చేసుకుని మగ్గం నేయడానికి అనువుగా ఉండేలా చూడాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అన్ని పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, మధ్యవర్తులు నమ్మి మోసపోవద్దని కలెక్టర్ సూచించారు. పలువురు నేతన్నలు మాట్లాడుతూ బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయడంలో ఇబ్బందులు పెడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన ఆయన ప్రతినెలా నిర్వహించే డిసిసి సమావేశంలో ఈ విషయం చర్చించి తగు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, బయటి వ్యక్తులను దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఇంట్లో మగ్గాలు ఉన్న 250 మందికి త్వరలో అనుమతులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కాలక్రమేనా మగ్గం నేసే నేతల సంఖ్య తగ్గు ముఖం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మగ్గం ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ మార్కెటింగ్ లేదని, దళారుల వల్ల అసలైన నేతలకు సరైన పరిహారం అందడంలేదన్నారు. మాచర్లలో త్వరలో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. పూర్తిస్థాయిలో ధ్రువీకరించిన తర్వాత జియోట్యాగింగ్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తామన్నారు. ఐకియా వంటి ప్రసిద్ధ సంస్థలతో చర్చించి చేనేత ఉత్పత్తులకు మరింత ఆదరణ పొందేలా కృషి చేస్తామని అన్నారు.


మాట్లాడుతున్న ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, పక్కన కలెక్టర్ శివశంకర్ తదితరులు

విశ్వాసం ఉంటేనే పార్టీలో చేరతారు

కన్నా లక్ష్మీనారాయణపై మంత్రి అంబటి విమర్శలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

నువ్వు పార్టీలు మారినంత తేలిగ్గా ప్రజలు మారని, సిద్ధాంతం, నీతి, నిజాయితీ లేని కన్నా లక్ష్మీనారాయణను నమ్మే పరిస్థితి లేదని రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ .. భయం గుప్పెట్లో సత్తెనపల్లి అని, డి.ఎస్.పి మంత్రి గుమస్తాలాగా పని చేస్తున్నాడని. కన్నా విమర్శిస్తున్నాడని,గత నాలుగేళ్లుగా అధికారంలో ఉన్నానని, ఎవరినైనా ఎప్పుడైనా బెదిరించానా?అని ప్రశ్నించారు. పచ్చ చొక్కాలకు కూడా పనిచేసే పెట్టానని, మీ వెంట ఉన్న వారిని అడిగి చెప్పమన్నారు . పోలీసు వ్యవస్థ దాని పని చేసుకుంటుందన్నారు. స్టేషన్ ముందు ధర్నా చేస్తానన్నావు.. విషయం లేకుండా ఏం చేస్తావో, ఎలా చేస్తావో చూస్తామన్నారు. తొండపి వడ్డెర వర్గాలను బెదిరించి పార్టీలో చేర్పించుకుంటున్నానని కన్నా ఆరోపిస్తున్నారని, బెదిరిస్తే ఎవరూ చేరరని నమ్మకం, విశ్వాసం ఉంటేనే చేరుతారని అంబటి స్పష్టం చేశారు.



సమావేశంలో మంత్రితో పాటు మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వర రెడ్డి, మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, పక్కా ల సూరిబాబు, పట్టణ, రూరల్ కన్వీనర్లు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల వృత్తికి భంగం కలిగించొద్దు

ప్రభుత్వానికి ఏపీ రైటర్ల సంక్షేమ సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర ప్రభుత్వం ఆస్థుల రిజిస్ట్రేషన్ విధానంలో నూతనంగా తీసుకొస్తున్న కార్డ్ ప్రైమ్ 2.0పై డాక్యుమెంట్ రైటర్లు తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం కార్డ్ ప్రైమ్ 2.0ను ప్రజలు, కక్షిదారులపై రుద్దు తుందని అన్నారు. కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్వేర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆస్థులకు భద్రత ఎలా సాధ్యమని రైటర్ల సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన సాఫ్ట్వేర్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్ వినుకొండలో డాక్యుమెంట్ రైటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్డ్ 2.0పై ప్రభుత్వ విధానాన్ని ఆయన రైటర్లకు వివరించారు. ప్రభుత్వం ప్రజల్లో చైతన్యం కల్పించకుండా ఆఘమేఘాల మీద నూతన సాఫ్ట్వేర్ను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా డాక్యుమెంట్ రైటింగవత్తిపై ఆధారపడిన రైటర్లకు ప్రభుత్వం భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్డ్ ప్రైమ్ 2.0 ద్వారా జరిగే రిజిస్ట్రేషన్లో ఒరిజినల్ దస్తావేజులు కక్షిదారులకు రాకపోవటం వలన భవిష్యత్ ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. నూతన విధానంపై ప్రభుత్వం ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించటంతోపాటు, వారి సందేహాలను నివత్తి చేశాకే అమలు చేయాలని కోరారు. భద్రత లేని రిజిస్ట్రేషన్లవైపు ప్రజలు ఎలా మొగ్గుచూపుతారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వేణుగోపాల్ ప్రశ్నించారు. ప్రభుత్వ విధానంపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైటర్లు కరపత్రాలు ప్రదర్శిస్తూ తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో వినుకొండ డాక్యుమెంట్ రైటర్లు, వారి సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



రైలు గేటును తెరిచే వరకూ పోరాడతాం


మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

ప్రజాశక్తి-తెనాలి

రైతు ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను ఢిల్లీ రైతాంగ ఉద్యమస్ఫూర్తితో తిప్పికొడతామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్నా శివశంకరరావు అన్నారు. రేపల్లె-తెనాలి రైలు మార్గంలో జంపని-చినరావూరు రైలు గేటు మూసివేతపై అఖిలపక్ష రైతాంగ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ముద్దన సాంబశివరావు అధ్యక్షతన జగ్గడిగుంటపాలెం పాత పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో శివశంకరరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. రైలు గేటు మూసివేత ఎనిమిది గ్రామాల రైతులకు శాపంగా మారిందన్నారు. ఎరువులు, విత్తనాలు, పండించిన పంట తరలింపుకు అదనపు భారం పడుతోందన్నారు. అధికార యంత్రాగం ద్వారా రైల్వే అధికారులకు పలుదఫాలు విన్నవించినా స్పందన లేదని, గేటు తెరిపించే వరకూ ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రైలు గేటు మూసివేత కారణంగా రూ.4 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన రోడ్డు సైతం రైతులు ఉపయోగించుకోలేక పోతున్నారన్నారు. గేటు మూసివేతతో ఎడెనిమిది కిలోమీటర్లు అదనంగా తిరిగి పొలాలకు వెళ్లాల్సి వస్తోందని రైతులు బొంతా అంజనేయులు, తాటి భూలక్ష్మి సదస్సులో అవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు కన్వీనర్‌గా కుర్రా వెంకటరమణ, కెవి.సత్యనారాయణ, తాటి కృష్ణ తదితర 13 మంది రైతులతో రైల్వే గేటు సాధన కమిటీని ఎన్నుకున్నారు.



ఘనంగా ఏసురత్నం పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పుట్టినరోజు వేడుకలు శుక్రవారం గుంటూరులోని గుజ్జనగుండ్లలో ఆయన కార్యాలయం వద్ద ఘనంగా జరిగాయి. చంద్రగిరి ఏసురత్నంకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు నంబూరు శంకరరావు, మద్దాలి గిరిధర్, మహ్మద్ ముస్తాఫా, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైసిపి నాయకులు చంద్రగిరి ధీరజ్, తాడిశెట్టి మురళీ, నూరి ఫాతిమా, డిప్యూటీ మేయర్లు సజీలా, డైమండ్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పెన్షన్లు పంపిణీ చేసిన డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలో కొత్తగా 242 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి శుక్రవారం తెలిపారు. మంజూరైన పింఛన్లను ఆయా గ్రామాలలో పంపిణీ చేసినట్లు తెలిపారు. డిఆర్‌డిఎ పీడీ హరహరనాథ్ తాడికొండలో పింఛన్లను పంపిణీ చేసి పాత పింఛన్లను పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ ఇఒఆర్‌డి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి : ప్రభుత్వాలను ప్రజలపై వేస్తున్న భారాలను ప్రతిఘటించడానికి సిద్ధం కావాలని సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్న తిరుపతయ్య కోరారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో బి.సర్వారెడ్డి 9వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబిరెడ్డి, ఎ.ప్రభాకర్, పి.వెంకటయ్య, ఎం.డాంగే, రామారావు, ఎస్‌కె ఖాశీం, శీలం శ్యామ్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-తెనాలి

ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని వారికి మరింత మెరుగైన సేవలందించేందుకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ప్రజలు 9959225422 నంబరుకు ఫోన్ ద్వారా సమస్యలు వివరించవచ్చని సూచించారు.

గ్రూప్-4 అభ్యర్థులకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-గుంటూరు


నియామక పత్రాలు అందచేస్తున్న కలెక్టర్, తదితరులు

ప్రజలు ఆశించినంత స్థాయిలో ప్రభుత్వ సేవలను మెరుగ్గా అందించేలా ఉద్యోగులు బాధ్యతగ విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఏపీపీఎస్సీ 2021లో జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెవెన్యూ శాఖలో గ్రూప్-4 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయిన 56 మందికి శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు నియామక ఉత్తర్వులు అందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారు సర్వీస్ ప్రారంభం నుంచే ప్రజలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సానుకూల దక్పథంతో పరిశీలించి ప్రభుత్వ సేవలు అందేలా పనిచేయాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖతో అధిక శాతం మంది ప్రజలకు నిత్యం పనులు ఉంటాయని సాధ్యమైనంత వరకు మీ పరిధిలో ఉన్న అంశాలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు, నూతనంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో వైద్యులకు మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి


చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న సూపరింటెండెంట్

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో అత్యవసర విభాగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన క్యాజువల్టీని పరిశీలించి మాట్లాడుతూ క్యాజువల్టీలో వైద్యులకు, నర్సులకు, పారామెడికల్ సిబ్బందికి రూములున్నా బాత్రూంలు లేకపోవడం వలన ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దానివల్ల కొంతమంది వైద్యులు, వైద్య సిబ్బంది బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇది రోగులకు వైద్య సేవల్లో జాప్యానికి కారణముతోందని, అందుకే బాత్ రూమ్‌లను ఏర్పాటు చేయాలనీ నిర్ణయించుకున్నామని చెప్పారు. ఆస్పత్రిలోని పలు విభాగాల్లో మరమ్మతులు చేయడానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించిందన్నారు. పలు విభాగంలో కూడా రంగులు వేసి శోభయంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైద్య సిబ్బందిని శుక్రవారం సూపరింటెండెంట్ పరామర్శించారు. ఆస్పత్రిలో ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఎంఎన్ఒ ఒకరు చికిత్స పొందుతున్నారు. వారిని పరామర్శించిన సూపరింటెండెంట్ సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవింద నాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-ప్రత్తిపాడు


వంగిపురంలో ర్యాలీ

తల్లి పాలలో అనేకమైన పోషకలు ఉన్నాయని ప్రత్తిపాడు సెక్టర్ సూపర్ వైజర్ వెంకటరత్నం అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు మెయిన్ అంగన్వాడీ కేంద్రం నందు గర్భిణులు, బాలింతల గృహసందర్శన కార్యక్రమం నిర్వహించారు. బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వెంకటరత్నం వివరించారు. తల్లిపాలలో సంపూర్ణపోషక విలువలు ఉంటాయని, అవి శిశువుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడతాయని చెప్పారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, ముర్రుపాలు బిడ్డకు తొలి టీకా అని, కేవలం ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే తాగించాలని, ఇతర పానీయాలు ఏమీ పట్టించకూడదని అన్నారు. బిడ్డకు రెండేళ్లు వచ్చేవరకు అనుబంధహారంతో పాటు తల్లిపాలను కూడా ఇవ్వాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే కిట్‌లలోని పదార్థాలను తినాలని, వీటితోపాటు ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు పండ్లు తీసుకోవాలని చెప్పారు. వంగిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించగా గొట్టిపాడు సెక్టార్ సూపర్వైజర్ వి.అరుణ, అంగన్వాడీ టీచర్ తిరుమలదేవి, హెల్పర్ దుర్గ పాల్గొన్నారు.



సెల్‌ను ప్రారంభిస్తున్న కుప్పుస్వామి తదితరులు

జెసి లా కాలేజీలో కెరీర్ గైడెన్స్ సెల్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెసి న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్ సెల్‌ను కళాశాల సెక్రెటరీ వేమన కుప్పుస్వామి శుక్రవారం ప్రారంభించారు. న్యాయ విద్యార్థులకు సంబంధించి విద్య, ఉద్యోగ అవకాశాలను ఈసెల్ ద్వారా వివరిస్తామని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థులు ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ లీగల్ మేనేజర్ వై.కిరణ్‌కుమార్, కెనరా బ్యాంక్ లా మేనేజర్ కె.శివకేశవ ఆధ్వర్యంలో ప్రస్తుతం చదువుతున్న ఐదుగురు విద్యార్థులతో ఈ సెల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.సుధాకర్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఎం.జస్వంతరావు శుక్రవారం తెలిపారు. ఈనెల 3 నుంచి ఆరో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18-35 ఏళ్లుండి పదోతరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, నిబంధనల మేరకు వయో పరిమితిలో సడలింపు ఉంటుందని అన్నారు. దరఖాస్తులను 7, 8 తేదీల్లో పరిశీలించి, 12,13 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికైన వారికి 15 నుంచి విదులు కేటాయిస్తామని వివరించారు. వివరాల కోసం కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

కొలకలూరులో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-తెనాలి

మండలంలోని కొలకలూరులో చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతోంది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సారథ్యంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంచారు. స్థానికులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పేద వర్గాల కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేశామని, అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో లబ్ధి పొందని వారికీ సంక్షేమ పథకాలను అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి కె.స్వప్న, కె.రాయల్, కె.రమేష్, పి.బాలగురవమ్మ, బాబి పాల్గొన్నారు.

కొలకలూరులో పురంధేశ్వరి పర్యటన

ప్రజాశక్తి-తెనాలి

ప్రధాని మోడీ ఈనెల ఒకటి నుంచి 15 వరకూ పిలుపు నిచ్చిన నా భూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి శుక్రవారం మండలంలోని కొలకలూరులో పర్యటించారు. కలశంలో మట్టి సేకరించారు. ప్రతి గ్రామం, ప్రతి ఇంటి నుంచి సేకరించిన మట్టిని డిలీల్లో నిర్మించే అమృతవనంలో ఉంచుతామన్నారు. భారతీయులంతా సమానమే అన్న భావనతో అన్ని ప్రాంతాల నుంచి మట్టి సేకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చందు సాంబశివరావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.





గారెత్ విన్ ఓవెన్‌తో వర్సిటీ వీసీ, తదితరులు

విజ్ఞాన్స్ వర్సిటీని సందర్శించిన బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

భారత్‌దేశం వేదికగా జరగబోయే జీ20 సదస్సు ద్వారా భారత్-యూకే మధ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ప్రమోషన్స్ కొలాబరేషన్స్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యాసంబంధమైన అంశాలతోపాటు, దౌత్యపరమైన అంశాల గురించి వర్సిటీ వీసీ పి.నాగభూషణ్‌తో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా బ్రిటీష్ డెప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్‌తో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ నాగభూషణం, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, వివిధ విభాగాల డీన్లు ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గారెత్ విన్ ఓవెన్ మాట్లాడుతూ విద్య, పరిశోధనలతో పాటు సాంస్కతిక మార్పిడి, పరస్పర సహకార అవకాశాల అన్వేషణ వంటి అంశాల గురించి చర్చించామన్నారు. ఉమ్మడిగా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఇరువురి మధ్య భాగస్వామ్యం పటిష్టమవ్వడంతో పాటు విద్యాపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. దీని ద్వారా విద్యార్థులకు, అధ్యాపక సిబ్బందికి అపారమైన ప్రయోజనాలు చేకూరుతాయని వెల్లడించారు. అనంతరం ముఖ్య అతిథిని విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతినిధులు సన్మానించారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బ్రహ్మారెడ్డి



ప్రజాశక్తి- గుంటూరు లీగల్

గుంటూరు నాల్గవ అదనపు జిల్లా కోర్టులో డెకాయిటీ కేసులు నిర్వహించటానికి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున హోం ప్రిన్సిపాల్ సెక్రెటరీ నియామక పత్రం అందజేశారు. గతంలోనూ బ్రహ్మారెడ్డి మూడేళ్లపాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. ఈ నియామకంపై గుంటూరు బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి కృషి చేసిన అందరికీ బ్రహ్మారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

క్రస్ట్ గేట్ల మరమ్మతుల పరిశీలన

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి క్రస్ట్‌గేట్ల మరమ్మతు పనులను శ్రీశైలం ప్రాజెక్టు సిఇ సుధీర్‌బాబు శుక్రవారం పరిశీలించారు. మరమ్మతులకుగాను రూ.50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. మెయిన్ కంట్రోల్ రూమ్ నూతనంగా ఏర్పాటు చేసిన ఏసీలు విద్యుత్ ఉత్పత్తి చేసే టర్బైన్లను ఆయన పరిశీలించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 6.010 టీఎంసీల నీరుందని ప్రాజెక్టు ఎస్ఇ వెంకటరమణ తెలిపారు. పరిశీలనలో డిఇ గిరిబాబు, రాజారెడ్డి, నాగరాజు సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు జెవివి జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-గుంటూరు : జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు ఆదివారం స్థానిక కన్నా ఇంగ్లీషు మీడియం స్కూల్లో నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్, బి.ప్రసాద్ తెలిపారు. మహాసభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్యవక్తగా పాల్గొంటారని, జెవివి నాయకులు, సైన్స్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

8న జెడ్పీ సమావేశాలు

ప్రజాశక్తి-గుంటూరు : జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు, జనరల్ బాడీ సమావేశం ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సిఇఒ మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరుగుతాయని, తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుండి సర్వసభ్య సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

కలెక్టరేట్ ఎదుట సిపిఎస్ ఉద్యోగులు ధర్మ పోరాట నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఎపి సిపిఎస్ యుఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం తేవాలని ధర్మ పోరాట నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరై ప్రసంగించారు. సిపిఎస్ రద్దుకు జరిగే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.తిరుమలరెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో సిఎం తన సుదీర్ఘ పాదయాత్రలో తాము అధికారంలోకి రాగానే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని వాగ్దానం చేశారని, అధికారం చేపట్టి నాలుగేళ్లు దాటిని హామీ అమలు చేయలేదన్నారు. ఇప్పటికే సిపిఎస్ ఉద్యోగులు తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నారని, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జిపిఎస్‌ను అంగీకరించబోమని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, సతీష్‌కుమార్, ఎపిటిఎఫ్ 1938 జిల్లా కార్యదర్శి మేకల సుబ్బారావు, ఆదినారాయణ, గణేష్, ఎన్ఆర్‌కె బాబు, శివన్నారాయణ, కిషోర్ ప్రసంగించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకులు, ఉద్యోగులు

కలెక్టర్‌కు ఎపిజిఇఎ వినతి

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ఒపిఎస్ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ షేక్.కరిముల్లా షాఖాదరి, మహిళా నాయకులు నీలిమ, మల్లేశ్వరి, రోజారాణి, పెన్షనర్ల సంఘం నాయకులు పి.కేశవరెడ్డి, గ్రామ, వార్డు సచివాయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు షేక్.అబ్దుల్ రజాక్, టివిఎస్ మణికంఠ పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న నాయకులు, ఉద్యోగులు

బీమా మార్కెట్‌లో తిరుగులేని శక్తిగా ఎల్ఐసి

68వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

భారతీయ జీవన బీమా సంస్థ 68 సంస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక అరండల్‌పేట 4వ లైనులోని ఎల్ఐసి కార్యాలయంలో వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జాతీయకరణ నుండి గత 67 ఏళ్లలో సంస్థ సాధించిన ప్రగతిని, విజయాలను ఆయన వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన బండ్లమూడి హనుమాయమ్మ జూనియన్ కాలేజి ప్రిన్సిపాల్ పి.సుమతి ప్రసంగిస్తూ 1956లో రూ.5కోట్ల ప్రారంభ పెట్టుబడితో మొదలైన ఎల్ఐసి అద్భుత ప్రగతిని సాధిస్తూ నేడు సుమారు రూ.45 లక్షల కోట్ల ఆస్తులు కలిగి ఉండటం అభినందనీయమన్నారు. దేశంలోని అన్ని రంగాలకూ నిధులు కేటాయిస్తూ మన ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు సంభవించినప్పుడు సకాలంలో క్లెయిమ్‌లు చెల్లించేందుకు ఎల్ఐసి ప్రత్యేక శ్రద్ధ వహించటం సామాజిక కృషికి నిదర్శనమన్నారు. పోటీ వాతావరణంలో సైతం సవాళ్లను ఎదుర్కొని, ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుంటూ బీమా మార్కెట్‌లో ఎల్ఐసి తిరుగులేని శక్తిగా ఎదిగిందని ప్రశంసించారు. వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఎల్ఐసి మరింత శక్తివంతం చేసేందుకు కృషి చేస్తామని అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ బి.రవీంద్ర, పాలనాధికారులు ఎమ్‌డి.రఫి, జి.కిషోర్‌కుమార్, ఏజెంట్స్ యూనియన్ జోనల్ అధ్యక్షులు బి.మార్కండేయులు, ఐసియు జాయింట్ సెక్రెటరీ వివికె.సురేష్, పి.వి.రమణ, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, శ్రీదేవి పాల్గొన్నారు.



ప్రత్యేక సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బిహెచ్ కాలేజి ప్రిన్సిపాల్

గుంటూరులో 6,987 మంది, పల్నాడులో 18,747 మందికి రైతు భరోసా

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

రాష్ట్ర వ్యాప్తంగా వరుసగా ఐదవ ఏడాది మొదటి విడతగా కౌలు రైతులకు వైయస్సార్ రైతు భరోసా, మే నుండి ఆగష్టు నెల వరకు కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన రైతన్నలకు ఇన్ పుట్ సబ్సిడీ నిధుల మంజూరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ మండేపూడి పురుషోత్తం పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు రైతు భరోసా ద్వారా ఐదవ సంవత్సరం మొదటి విడతలో 6,987 మంది కౌలు రైతులకు మంజూరు చేసిన రూ.5.240 కోట్ల మెగా చెక్కును అందచేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖాధికారి రవీందర్, కౌలు రైతులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయిమార్కొండారెడ్డి పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలో 18747 మందికి రూ.14.6 కోట్ల మెగా చెక్కును లబ్ధిదార్లకు అందించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ కౌలు రైతులకు రూ 7.5 వేలు చొప్పున మొదటి విడతగా జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ సహాయ సంచాలకులు సిహెచ్ రవికుమార్, నరసరావుపేట, వినుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ, బి.రవిబాబు పాల్గొన్నారు.



గుంటూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, తదితరులు



నరసరావుపేటలో మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్